# ప్రకటిత ప్రణయం

"బదరీనాథ్"

"పార్వతి చదువుకున్నదే, సంస్కార భావాలు కలిగినదే, ఉన్నతభావాలు కలిగున్న నారీమణే, సాక్షాత్తూ పతివ్రతామతల్లే. అయితే లాభమేమిటీ? సంఘం పార్వతిని వెలేసింది. అంటే—పార్వతి ఆడది గనక. మొగాణ్ణయినా వెలేస్తారు, కాని కాస్త తేడావుంది. పవిత్రమైన బ్రాహ్మణ్యాన్ని మంటగలిపి మరో నాయుణ్ణి పెళ్ళిచేసుకోడానికి వెనుకాడంది— సంఘంలో యింతపేరు సంపాయించుకున్న వాళ్ళం, యింత పవిత్ర బ్రాహ్మణసంఘానికి అధినేతలం"- అనుకునే కొందరు పెద్దలు పార్వతిని వెలేసినా- దొంగతనంగా చాటుమాటుగా పార్వతింటికెళ్ళి, మన్మథతాపం వెళ్ళబోసుకుని చెప్పుదెబ్బలు తిన్నవాళ్ళున్నా లేకపోలేదు. అందులోనూ - సూరావధాన్లు పార్వతికి వేలువిడిచిన మేనమామే అల్లా చేసిన్నాడు ఇహ మీరూ నేనూ చెయ్యడంలో తప్పేం వుందీ? అసలు మాటవరసకన్నాను సుమండీ. నిజానికి పార్వత్తైనా మరోలాంటి మనిషికాదు. కేవలం అగ్నితో సరిపోల్చదగింది" అన్నాడు విశ్వేశ్వరరావు 'పార్వతింటికెందుకెళ్ళావయ్యా' అన్న ప్రమధావధాని ప్రశ్నకి.

"నిజంగా ఆలోచించిచూస్తే పార్వతి చేసిన పని చాలా మంచిదేమో ననిపిస్తుంది. చాలా ధైర్యంగానూ, బలీయమైన ఆత్మవిశ్వాసంతోనూ సంఘాన్ని యెదిరించి ముందడుగు వేసింది. అంతవరకూ పార్వతి ప్రశంసాపాత్రురాలే. ఒప్పుకుంటాను. కాని యీమధ్య జగన్నాథంతో కాస్త చనువుగా వుంటోందని అతనే చెప్పాడు, పైగా, కర్ణాకర్ణిగా కూడా విన్నాను." అన్నాడు ప్రమధావధాని. విశ్వేశ్వరరావు అన్నాడు. ఏమనీ- "ఇల్లా చూడు అవధానీ! ఒకమనిషి - ఎంత మంచిదైనాసరే- ఒకసారి చెడిపోయాక, లేక చెడిపోయిందీ- అనిఅనుకోబడ్డాక, ఆ ఆడది యే మొగాడివంక యెంత సద్భావంతో చూసినాసరే, దాన్ని చాలా చులాగ్గా చూడ్డమన్నది సహజంగా వుండే మన ఆత్మల దౌర్బల్యాన్నీ, సంఘంలో వుండే మాలిన్యాన్ని అతి చులాగ్గా చూపెడ్తుంది. లేకపోతే - జగ్గిగాడు నీతో ఆ ముక్కనడమేవిటి చెప్పూ. వాడికేమాత్రం సంస్కారమన్నావుంటే అట్లా మాట్లాడుతాడూ - పోనీ, వీడేవన్నా నవమన్మథుడా? లేక చదువులో విఘ్నేశ్వరుడంతటివాడా? "ఆ" అంటూనేమో ఆకారాన్ని చూసి. నిజానికి - ఎందులో ఘనుడమ్మా జగన్నాధం మూర్తి కంటేనూ? మూర్తి కోసమే సంఘాన్నీ, తల్లిదండ్రుల్నీ, అందర్నీ వొదిలి పెట్టుకొని వచ్చేసి, మూర్తే తన లోకమనుకున్న పార్వతి తిరిగి జగన్నాధాన్ని ప్రేమించిందంటే - చదువూ, సంస్కారమూ, విమర్శనాజ్ఞానమూ వున్న నువ్వేలా నమ్మగలిగావోయ్" ఇదికొంతవరకు సవ్యంగానే తోచింది ప్రమధావధానికి. అయినా అన్నాడు: "ఏమోనోయ్. 'క్షణక్షణముల్ ... అదేమిటీ ... ఏవో... మారు జవరాండ్ర చిత్తముల్' అన్నారు గదటోయ్ పెద్దలు. అయినా ..." కళ్ళు కాస్త చిన్నవిచేసి పైకిచూస్తూ పెదిమలు బిగపట్టి "...జగన్నాధం అంత రోగ్ కాడేమో?" అన్నాడు కాస్త ఆలోచిస్తూ. అన్నాక విశ్వేశ్వరరావు మొహంవంక చూసేడు. అతను 'హు' అన్నాడు గుండెల్లోంచి నవ్వుతూ. యింకా అన్నాడు "జగన్నాధం సంగతి నీకేంతెలుసు నవధానీ? వాడికీ నీకూ స్నేహమై మూడేళ్ళయింది. అంతేనా? వాడూ, నేనూ పన్నెండేళ్ళనుంచీ స్నేహితులం, క్లాస్‌మేట్సుం, పొరుగిళ్ళవాళ్ళం, వాడి సంగతి సందర్భాల్నీ - వాడి సైకాలజీని, క్లోజ్‌గా 'అబ్జర్వ్' చేసిన నాకంటె నీ కెక్కువగా తెలీదు. ఏమంటావ్?"

"అఫ్ కోర్స్. నాకంటె వాణ్ణి గురించి నీకే యెక్కువ తెలిసుండొచ్చు, కాదనను, కాని జరిగిన మూడు సంవత్సరాల్లోనూ – అంటే అతనూ నేనూ గాఢ స్నేహాన్ని చవి చూచిన యీ మూడేళ్ళల్లోనూ జగన్నాథం నా కళ్ళకొక పరమ పవిత్ర మూర్తిగా, ఆదర్శ పురుషుడిగా కనుపించాడు. ఇప్పటికి నేను సంపాదించుకున్న స్నేహితుల్లో నాలో పవిత్ర స్థానాన్నాక్రమించుకున్నది జగన్నాథమే," అంతా విన్న విశ్వేశ్వరరావేమీ మాట్లాడ లేదు. ఇంతలో జగన్నాథమే అక్కడికొచ్చాడు. "హల్లో" లన్నీ పూర్తయాక "నడవండి కాఫీ తాగుదాం" అన్నాడు జగ్గయ్య. ఆమాట విన్న విశ్వేశ్వర్ చటుక్కున ఆశ్చర్యపోయాడు. అందుకు కారణమూ లేకపోలేదు. తమిద్దరికీ వున్న యీ పన్నెండేళ్ళ పరిచయంలోనూ తాను జగన్నాథానికి కాఫీ యిప్పించడమే గాని జగన్నాథం తనకు కాఫీ యిప్పించడం యిదే ప్రథమ పర్యాయం. ముగ్గురూ కాఫీ హోటల్లో చొరబడ్డారు. అక్కడున్నంత సేపూ జగన్నాథం ఓ పెద్ద తత్వవేత్తలా మాట్లాడేడు, జీవితంమీద చివరికి ప్రపంచంమీదే విరక్తి పుట్టేసినట్లు బెట్రాండ్ రస్సెలుని, రవీంద్రనాథ్ టాగూర్ నీ, మహాత్ముని, ఉదహరిస్తూ మహోపన్యాసం దంచేశాడు. ఆశ్చర్యచకితుడైపోయాడు విశ్వేశ్వరరావు. ఏదో అర్జంటు పనుందని చెప్పి అవధాని వెళ్ళిపోయాడు. విశ్వేశ్వరరావు బుర్రలో ఎన్నో ఘోర యుద్ధాలు జరిగిపోతున్నాయ్. ఎందుకూ? జగన్నాథాన్ని గురించి తను చాలా హీనంగా చెప్పేడు అవధానితో. కాని తను చెప్పినదానికీ, జగన్నాథం యొక్క అప్పటి ప్రవర్తనకీ చాలా తేడా వుంది. కాబట్టి యికనుంచీ అవధాని తన్నొక యీర్ష్యాళువుని చూసినట్టు చూస్తాడేమోనని, అతని దగ్గిర తనమాట బోటుపోయినందుకూ విశ్వేశ్వరరావు ఊహాపోహలమధన పడిపోతున్నాడు. అయినా–దానికి తనేం చేస్తాడూ? తనకీ జగన్నాథానికీ సాగిన–సాగుతూన్న యీ పన్నెండేళ్ళ స్నేహంలోనూ, అనుభవంలోనూ తను కల్పించిందిగాని, ఈర్ష్య చేత అన్నముక్క నిగా యేదిన్నీ లేదు. "అనుకుంటే అనుకోనీ" అని



'ప్రకలపాట్లు'లో అభినేత్రి లలిత

సమాధాన పరుచుకొన్నాడు విశ్వం. ఈ ధ్యాన మేగాని? ప్రేరేపేస్తూ జగన్నాథం ఓ ముక్కన్నాడు. "సి.రేయ్, నీకో సంగతి చెప్తాను. నువ్వనాబట్టి చెపుతున్నా గాని మరో కళ్ళయితే చెవిను పెడితేవాళ్ళే గాదు. కడుపులోనే ఉంచుకోవాలనుకున్నా—" చెవి కొరికేస్తున్నాడేమో అనిపించేటంత దగ్గిరగా జరిగి చెవిలో ఊదాడు. "మూర్తికి తెలియకుండా మనకీ పార్వతీకీమధ్య చాలరహస్యంగా వ్యాపారం జరుగుతోంది. మనం వ్రాయకుండానే ముందరపార్వతీదగ్గర్నుంచే డజన్లకొద్దీ ఉత్తరాలొచ్చి పడ్డాయ్."

ఈమాట విన్నాక విశ్వేశ్వరరావు తల్లడిల్లి పోయేడు.

ఏమిటిది? ఒక పావుగంట క్రితం జీవితమే చివరికి ప్రపంచమే 'మిథ్య' అన్న యీ జగ్గిగాడు అవధాని వెళ్ళిపోడంతోటే యిలా మాట్లాడుతున్నాడేమిటి? ప్రమథావధానితో ప్రణయవీక్షణాలు ప్రసరింపజేస్తూందనే గదా చెపుతా? అప్పుడే ఉత్తరాలుగూడా వ్రాయడం

మొదలుపెట్టిందా ఆమె, ఒకవేళ నిజంగా తనూ ప్రేమిస్తూంటే యీ కలాపం బయట పెట్టడమెందుకూ? జగన్నాథంమీద యేదో అనుమానమూ, కసీ ప్రారంభమయినాయ్ విశ్వేశ్వరరావుకి! ఎవరు యెన్ని చెప్పినా అతను మాత్రం పార్వతిని శంకించడు, శంకించలేడు గూడాను. కాని యివ్వాళ ఆటో-యిటో తేల్చుకోవాలి. జగన్నాథం యెంతవరకూ నిజయతీ ఐనవాడో అవధానిముందే తేలిపోవాలి.

లేకపోతే పార్వతి ప్రణయ కలాపమైనా బయటపడాలి. ఈ దెబ్బతో అవధానికి తనమీదేమైనా చెడ్డ అభిప్రాయం వుంటే అది కాస్తా తొలిగిపోవాలి.

విశ్వేశ్వరరావు అన్నాడు: "ఒరేయ్ మూర్తి ఊళ్ళోలేడు, మనం పార్వతింటికి వెళదాం. నేను చాటుగా వుంటాన్లే. ఎలాగైనా నిన్ను పార్వతి ప్రేమిస్తూంది గాబట్టి మొహంమీదనే అడిగేసి యేదో ఒకటి తేల్చేసుకుందుగాని" జగన్నాథానికి పచ్చి వెలక్కాయ గొంతు కడ్డంగా పడింది.

"అబ్బెబ్బె, అల్లా వెడితే బాగుండదురా, పైగా నువ్వుగూడా యెందుకూ?" జగన్నాథం.

"ఏడిశావ్ పద. నేనక్కడికి రాను లే" అన్నాడు విశ్వేశ్వరరావు. "అబ్బె, అయినా యివాళ కాదురా. అబ్బో, నాకు చాలా పనుంది రోయ్."

"ఏమైనా సరేరా. ఇవ్వాళ నువ్వొచ్చి తీరాలి."

మొత్తానికి స్ట్రాంగ్‌గా కన్విన్స్‌చేసి జగన్నాథాన్ని పార్వతింటికి బయల్దేరదీశాడు. దారిలో ప్రమధావధానీ కలిసాడు. మొత్తం మీద, యిహ తప్పక పార్వతింటికి వెళ్ళాలి సొచ్చింది జగన్నాథం. అంతకు ముందున్న చనువుకొద్దీ సగౌరవంగానే పలకరించింది పార్వతి. జగన్నాథం యెందుకో ఊహు గాభరా పడిపోతున్నాడు. వెళ్ళిపోవడానికి యెంతో ప్రయత్నం చేస్తున్నాడు పాపం! కాని అంతా విఫలమైపోతోంది.

ఏదో మాటలసందర్భంలో అంది పార్వతి. "నిజమేలెండి, ఒకసారి జీవితంలో, సంఘంలో 'తప్పు' అనుకోబడ్డ పనిచేశాక ఆ మనిషిని సరియైన దృష్టితో చూడ్డం యీ సంఘానికి చేతకాదు. సంఘమంటే యేవిటో కాదు. మీరూ, నేనూ, ఆయనా కలిస్తే సంఘం. నేనో తప్పు పన్చేసి, "సంఘంచేత వెలివేయబడ్డాక నన్ను మీ దృష్టిలో 'లూజ్'గా చూస్తూ మీరూ అదే తప్పుపని చెయ్యడానికి సిద్ధమౌతున్నారు."

అక్కడున్నవాళ్ళలో ఇది అర్థం చేసుకోలేక తికమక పడుతున్నది ప్రమధావధాని ఒక్కడే. కాని అతను పూర్తిగా తెలుసుకుని 'రియలైజ్' చెయ్యడంకోసం పార్వతి చేత ఉన్నముక్క బైటపెట్టించడానికివిశ్వంఅన్నదేవిటంటే - "నిజమే ననుకోండి. అయినా అల్లా చేసేవాళ్ళని మీరు నాకుచూపించగలరా?" అని.

"తప్పకుండా. ఎవరిదాకానో యెందుకూ? జగన్నాథంగార్నే అడగండి" చదువుకున్నదీ, కొంత విజ్ఞానం సంపాదించుకున్నదీ, దగ్ధహృదయా కాబట్టి అముక్కన్నదామె.

జగన్నాథం గుటకలు మింగుతో నీళ్ళు నముల్తున్నాడు. ప్రమధావధాని ఆశ్చర్యంతో ఊగిపోయేడు.

విశ్వం ఆశ్చర్య పోతున్నట్లు నటించాడు. తిరిగి ఆమె అంది. "ఆశ్చర్య పోతున్నారా? కావలిస్తే యిదుగో చూడండి." అని జగన్నాథం ఆమెకు వ్రాసిన ప్రణయలేఖ విశ్వేశ్వర్రావు కందించింది-విజయగర్వంతో ఆ లేఖ చదివాడు. ప్రమధావధానీ చదివాడు. ముక్కుమీద వేలేసుకున్నాడు గూడాను. జగన్నాథం పార్వతిని క్షమాపణ కోరుకోక తప్పిందికాదు. జగన్నాథం అవస్థ చూడలేక అందరూ బయటపడ్డారు.